# రెక్కలు

భార్య రుక్మిణమ్మ అందించిన కాఫీగ్లాసు పైనవేసుకున్న కండువా కొసతో పట్టుకుని రామచంద్రమూర్తి వరండాలోకి వచ్చి పేముకుర్చీలో కూర్చున్నాడు. గ్లాసు బాగా వేడిగా వుంది. ఆయనకి కాఫీపొగలు చిమ్ముతూవుండాలి. ఆ ఘుమఘుమలంటే మరీ యిష్టం.

గ్లాసు కిందపెట్టాడు. రిటైరైన తర్వాత సాయంత్రంపూట చిన్నగ్లాసుడు కాఫీ తాగడం అలవాటయింది. ఆ తాగేదేదో యింట్లో తాగొచ్చుగదా అని రుక్మిణమ్మ అనుకుంటుంది. కాని ఆ మాట ఎప్పుడూ భర్తతో అనలేదు. అది ఆయన ఇష్టం కాబోలనుకుని సంతోషిస్తుంది.

వరండాలో కూర్చుని గోడ అవతల ఎత్తుగా ఠీవిగా ఆకాశంవైపు శిరస్సు ఎత్తిన రావిచెట్టువంక చూస్తూ ఏవేవో ఆలోచన్లు నెమరువేసుకుంటూ కాఫీ చప్పరించడం రామచంద్రమూర్తికి ఎంతో యిష్టం.

రామచంద్రమూర్తి ఇంటిపేరు తెలిసినవారు చాలా తక్కువంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. రావిచెట్టు రామచంద్రమూర్తి అంటే ఇట్టే గుర్తుపడతారు. ఆయనకది కొండగుర్తు. ఆ చెట్టుకీ రామచంద్రమూర్తికీ చిత్రమైన అనుబంధం.

అతను కలలుగన్నట్టు ఇంటిస్థలాన్ని ప్రత్యేకంగా ఎంచుకున్నాడు. రెండు పడక గదులు, హాలు, వంట గది, దేవుడి గది, వరండా వుండేట్టు ఇల్లు కట్టించుకున్నాడు. ఉద్యోగంలో ఎప్పుడూ మనసుకు మసి అంటనివ్వలేదు. వీలైనంతవరకు నలుగురికి సాయం చేశాడు. అందుకే ఇప్పటికీ ఆయనకి అందరూ చేతులెత్తి దణ్ణం పెడతారు. మంచికి మారుపేరని అంటారు. జీవితంలో అంతకంటే తృప్తి ఏముంది? రుక్మిణమ్మ ఉత్తమ ఇల్లాలు... ఇద్దరు కొడుకులు. పెద్దవాడు ఇంజనీరు, అమెరికాలో ఉంటున్నాడు ఫ్యామిలీతో.

రెండోవాడు స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీ నడుపుతున్నాడు. బాగా కలిసొచ్చింది. పెళ్ళయి మూడుమాసాలయింది. కొత్తకోడలికి అందం, తెలివితేటలు, వినయం సమపాళ్ళలో వున్నాయి. కోడలు వరాల తల్లి అని రుక్మిణమ్మ మురిసిపోతూ వుంటుంది. రామచంద్రమూర్తీ అలాగే అనుకుంటాడు.

రావిచెట్టు ఆకులు చిరుగాలికి కూడా గలగలమంటాయి. రామచంద్రమూర్తి హృదయం సున్నితమైంది రావి ఆకులా! కాని ఆ అశ్వత్థం మాదిరి మనిషి గంభీరంగా వుంటాడు. స్పందనలన్నీ గుండెలోనే.

చెట్టుపైన వుండే పక్షి సంతానాన్ని చూసి ఆనందంతో పరవశిస్తూ వుంటాడు. వాటితో ఏదో అనిర్వచనీయమైన బంధాన్ని పెంచుకున్నాడు. ఏ పక్షులెప్పుడొస్తాయో, వాటిగూళ్ళేవో ఆయనకి బాగా తెలుసు. వాటి సంతానం గురించి ఇంకా బాగా తెలుసు.

ఈ మధ్య కొంగల గూడొకటి ఆయన్ని బాగా ఆకర్షిస్తోంది. ఆ గూట్లో రెండు పిల్లలున్నాయి. తల్లి కొంగ, తండ్రి కొంగవచ్చి పిల్లలకి ఆహారం పెడుతూ అవి పొందే ఆనందంలో తానూ పాలు పంచుకుంటాడు. పిల్లల కోసం వాటి ఆరాటం చూసి చలించిపోతాడు. రామచంద్రమూర్తి ఆ గూటివంక చూసిన ప్రతిరోజూ పిల్లలు వెనకటిరోజుకంటే పెద్దవిగా కనిపించేవి. విచిత్రం! నోరులేని ఆ పక్షులు త్వరత్వరగా పెరుగుతాయి. సృష్టినైజం వింతల్లో వింత. రెక్కలు రాగానే పిల్లలు గూడు వదిలేసి బాహ్య జగత్తులోకి, భవిష్యత్తులోకి దూసుకుపోతాయి. తిరిగి వాటినిచూసే భాగ్యం తల్లికొంగకిగానీ, తండ్రి కొంగకిగానీ వుండదు. పిల్లకొంగలూ అంతే. కన్నవారిని గురించి ఆలోచిస్తూ కూర్చుంటే వాటిబతుకు ఎలా సాగుతుంది! ఈ పిల్లలే త్వరగా పెద్దవై జంటని వెతుక్కుని ఎక్కడో గూడు కట్టుకుంటాయి. పుట్టిన పిల్లల్ని పెంచుతాయి. ఆ పిల్లలూ ఏదో ఒక రోజున వెళ్ళిపోతాయి. ఇది అనంతంగా సాగే క్రమం.

మామూలుగానే ఆ రోజు సాయంత్రం రామచంద్రమూర్తి కొంగల గూటివంక చూశాడు. గుండె గుభేలుమంది. చిన్నచిన్న రెక్కలు కదుపుతూ నోరు పెద్దగా తెరుస్తూ ఆహారం కోసం ఎదురుచూసే కొంగ పిల్లలు లేవు! క్రితంరోజు సాయంత్రం కూడా వున్నాయి. ఎప్పుడు ఎగిరిపోయాయో?

కొంగల జంట తిరిగివస్తే ఎలా? అంతపనీ అయింది. బోసిపోయిన గూడు చూసి గొల్లుమన్నాయి. వాటి రోదనకి చెట్టుపైవున్న మిగిలిన పక్షులు సానుభూతి పలికాయి. వాటికి తెలుసు ఈ ఆక్రందనకర్థం.

రామచంద్రమూర్తి మనస్సు కకావికలమయింది. చెక్కిళ్ళమీద కారుతున్న కన్నీటిని గమనించలేదు. కాఫీగ్లాసు కోసం వస్తున్న రుక్మిణమ్మ "భలేవారే! కాఫీ తాగనేలేదా పక్షుల సందట్లో?" అనగానే గతుక్కుమని ఆలోచన్ల నుంచి బయటపడి చెంపలు తుడుచుకుని గుటుక్కున కాఫీతాగి గ్లాసు అందించాడు.

దగ్గరకొచ్చి రుక్మిణమ్మ భర్తని పరీక్షగా చూసింది

"ఏవిటలావున్నారు?"

"నాకేం నిక్షేపంగా వున్నా - అలా కూర్చో."

"బాగుంది మీ వరస. కోడలూ, అబ్బాయి సెలవుగదా అని మధ్యాహ్నం సినిమాకి వెళ్ళిన సంగతి మర్చేపోయారా? వచ్చేవేళయింది. పొద్దున వంట వరాల తల్లే చేసింది. ఈ పూట నేచేస్తానని చెప్పా..."

రామచంద్రమూర్తి ఈ మాటలు వినిపించుకుంటున్నట్టులేదు. ఆ కొంగల జంట అరుపులు హృదయవిదారకంగా వున్నాయి.

"రుక్మిణీ!..." గొంతు గాద్గదికమయింది.

"ఏమండీ! ఏమిటిది? ఏమయిందండీ? చెప్పండీ!" విలవిలలాడుతూ అడిగింది.

"ఆ గూట్లో కొంగలు చూడు ఎలా ఏడుస్తున్నాయో!"

"నిజమే. ఎందుకలా అరుస్తున్నాయి?"

"నాకు అవి చెప్పాయా?"

"మీకన్నీ తెలుసు. అవన్నీ మీకు నేస్తాలేగా!"

"చూశావా రుక్మిణీ! వాటికీ మమతలూ, అనుబంధాలూ వుంటాయి. పైకి చెప్పలేవు... రెక్కలు వచ్చి వాటి రెండు పిల్లలూ వెళ్ళిపోయాయి. ఎప్పుడు వెళ్ళాయో ఎక్కడికి వెళ్ళాయో తెలియదు."

"అంతేకదండీ! రెక్కలొచ్చాక ఈ గూట్లోనే ఎలా వుంటాయండీ?"

"రుక్మిణీ! ఎంతబాగా చెప్పావే? నిజమే. కొంగ పిల్లలు నోరులేదు కాబట్టి చెప్పకుండా వెళ్ళిపోయాయి. వెళ్ళడం తప్పుకాదు గదా?"

"అవి పక్షులండీ!"

"రుక్మిణీ! పిల్లలమీద మమతలు మనకెలాగో పశువులకీ పక్షులకీ కూడా అలాగే వుంటాయి. కాదంటావా?

"నిజమేనండీ! ఆ కొంగల ఏడుపు వింటే తెలియడంలా వాటి బాధ? పిల్లలు ఎలా చెబుతాయండీ! వాటికి నోరేదీ?"

"పిల్లలు చెప్పి వెళ్ళిపోవడం సాధ్యమయితే తల్లి కొంగకీ, తండ్రి కొంగకీ అంత బాధ వుండదంటావా?"

"అవన్నీ నాకేం తెలుస్తాయండీ?"

"తెలియకపోతే ఇప్పుడు తెలుసుకోవడం అవసరం రుక్మిణీ!"

"మీరనేదేమిటో నాకు బోధపడడంలేదు. మీరు అదోలా మాట్లాడుతున్నారు. మీ గొంతు ఎందుకలా తడారిపోతోంది? ఇప్పుడేగా కాఫీ తాగారు. మంచినీళ్ళు తెమ్మంటారా పోనీ!"

"అక్కర్లేదు. ఒకమాట చెబుతా విను."

"చెప్పండి... త్వరగా చెప్పండి."

"రెక్కలొచ్చిన పిల్లలు బయటికి వెళ్ళొచ్చన్నావుగా?"

"అంటే?!"

"ఎల్లుండి తిథేమిటి?"

"ఇవ్వాళ అష్టమి. రేపు నవమి. ఎల్లుండి దశమి. అయినా ఈ తిథుల సంగతెందుకిప్పుడు?"

"మన రెండోవాడు ఫ్యాక్టరీ దగ్గర్లోనే స్థలం కొన్నసంగతి నీకు తెలుసుగదా?"

"అవును, అది మంచి స్థలం, బాగుంది. అయితే..."

"త్వరలో ఇల్లుకట్టే ఆలోచన వుందిట. అందుకోసం దగ్గర్లో వుండడం మంచిదని అక్కడే వేరే యిల్లు అద్దెకు తీసుకున్నాట్ట. దశమినాడు వాళ్ళిద్దరూ వెళ్ళిపోతున్నారు వేరే యింటికి. ఈ సంగతి పొద్దున నాతో చెప్పాడు. తట్టుకోలేవని నీకింకా చెప్పలేదు రుక్మిణీ!... వెళ్ళిపోతున్నారు... మనం... ఇద్దరమే ఈ గూటిలో..."

"నిజం...గా..నాండీ? నా వరాల తండ్రీ... నా వరాల తల్లీ.. మనల్ని విడిచి... వెళ్ళిపోతారాండీ?"

"తప్పదు రుక్మిణీ!... రెక్కలొచ్చాయి... వెళ్ళక తప్పదు... రుక్మిణీ!"

"ఏ...వం...డీ!"

కొంగలజంట ఆక్రందన, వృద్ధదంపతుల రోదనా కలిసిన వేదనాస్వరం లోకం అంతా వ్యాపించింది. కాని, ఎవరికీ వినిపించలేదు.

*('ఈనాడు' ఆదివారం, 11 సెప్టెంబరు, 1994)*